# ఆశ(యం)

యూనివర్శిటీలో ఇంటర్ కాలేజియేట్ కాంపిటీషన్లు జరుగుతున్నాయి. 'వరకట్న దురాచారం సమసిపోవడానికి మార్గాలు' అన్న విషయం మీద మాట్లాడాలి ఫైనలియర్ విద్యార్థిని మాలిని ఆవేశంగా మాట్లాడుతోంది.

"వివాహమనేది ఒక పవిత్రబంధం డబ్బుతో ముడిపడ్డది పెళ్లికానేకాదు. తరతరాలుగా ఉన్న పురుషాధిక్య సమాజానికి ఫలితమే ఈ వరకట్నం. తనతో జీవితం పంచుకోవడానికి సిద్ధపడ్డ అమ్మాయి మెడలో తాళి కట్టడానికి లంచం కావాలా మగవాడికి? పెళ్లికి ముఖ్యమైనది ప్రేమ డబ్బు కాదు..." ఇలా సాగిపోయింది ఆమె వాగ్ధోరణి.

వివాహబంధంలో డబ్బు కన్నా మనస్సు ముఖ్యమన్న ఆమె ప్రతిపాదనా, దాన్ని ఆమె వ్యక్తం చేసిన పద్ధతీ, భాషమీద ఆమెకున్న కమాండ్ అన్నీ కలిపి ఆమెకు ప్రథమ బహుమతిని సంపాదించి పెట్టాయి. పెద్ద కప్పుతో ఇంటికొచ్చిన కూతురికి దిష్టి తీసింది తల్లి సీతమ్మగారు. కప్పును డ్రాయింగు రూం షోకేసులో అందంగా అమర్చింది. తీరుబడిగా కూచున్న కూతురితో ఇలా అంది.

"అమ్మాయ్, వరకట్నం మీద మాట్లాడేవు ఫస్టుప్రైజు తెచ్చుకున్నావు. కానీ నీ మాటలు ఆచరణకు పనికిరావని గుర్తుంచుకో."

మాలిని ఆశ్చర్యంగా అడిగింది.

"ఇప్పుడా ప్రసక్తి ఎందుకు తెస్తున్నావు?"

"అదేమిటమ్మాయి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తెస్తాను. ఇంకో రెండు నెలల్లో నీ పరీక్షలయిపోతాయి. నిన్నో ఇంటిదాన్ని చేస్తే మా బాధ్యత తీరిపోతుంది. నాన్నగారు అప్పుడే మనవాళ్ళందరికీ చెప్పి ఉంచారు. మామాట కాదని ఎవరినీ చేసుకుంటావనుకోను. అయినా నువ్వు చదివింది ఉమెన్సు కాలేజీయేగా. ఎవర్నీ ప్రేమించి ఉండవు కదూ."

"నేను ఎవర్నీ ప్రేమించలేదు. మీ ఇష్టాన్ని కాదని ఎవర్నీ చేసుకోను. కానీ నేను నన్ను నన్నుగా ప్రేమించేవాణ్ణి చేసుకుంటాను. అంతేకాని నాన్నగారిచ్చే కట్నాన్ని, రేపు రాబోయే ఆస్తినీ లెక్కకట్టేవాణ్ణి నేను చేసుకోను."

సీతమ్మగారు మాలిని మాటలు భర్త రామారావుగారి చెవిలో వేసింది. ఆయన నవ్వి "మంచి సంబంధం దొరకనీ అమ్మాయిని ఒప్పిద్దాం మెల్లిగా నచ్చచెప్పి" అన్నారు.

❖ ❖ ❖

ఆ నచ్చ చెప్పడం ఆయన అనుకున్నంత సులువు కాలేదు. మాలిని కోసం ఎన్నో సంబంధాలు తెచ్చేరాయన. అందరూ మాలిని నచ్చిందన్నవాళ్లే - నచ్చక పోవడానికి కారణాలేమున్నాయి, తెల్లగా, సన్నగా, పొడుగ్గా ఉన్న అమ్మాయి అందానికి వంక పెట్టగలదా? ఫస్టుక్లాసులో పాసయిన ఆమెకు చదువు తక్కువయిందనగలరా? అమ్మాయి ఒక్కర్తే కూతురు. ఉన్న ఒక్క అన్నగారూ కెనడాలో ఉన్నాడు. ఇక కావాల్సిం దేమిటి? కానీ చూసి వెళ్లిన ప్రతి ఒక్కరూ ఒకేలా ఉత్తరాలు రాసేవారు.

"...మీ అమ్మాయి మాకు నచ్చింది. పోతే కట్నం, ఆడపడుచు లాంఛనాలూ, పెళ్లిఖర్చులూ...." అంటూ కావల్సినవి రాసేవారు. ప్రతి ఉత్తరానికీ మండిపడేది మాలిని. నచ్చింది నేనైతే ఇక మిగతా విషయాలెందుకని పోట్లాడేది. రామారావుగారు నచ్చ చెప్పడానికి ప్రయత్నించేవారు.

"అమ్మాయ్, నాకున్నది ఇద్దరే పిల్లలు. ఎలాగూ ఆస్తి అంతా మీకే కదా. ఈ రోజు లెక్కన చెరో అయిదు లక్షలూ వస్తుంది. నేనూ పోయాకనైనా మీకే కదా. ఆ డబ్బు వల్ల ఇప్పుడే మీ ఇద్దరి జీవితాలూ బాగుపడితే మాకుచాలు. అన్నయ్యని పాసేజి ఇచ్చి, అక్కడ సెటిలవడానికి డాలర్లిచ్చి పంపలేదా? ఇప్పుడు వాడు హాయిగా ఉన్నాడు. నీ పెళ్లికి కట్నమూ అంతే అనుకో."

మాలిని ఆయన మాటలు ఒప్పుకోలేదు. "అన్నయ్యకు మీరు ఇష్టపడి ఇచ్చేరు. నాకిచ్చేది మీ ఇష్టమా? అన్నీ వాళ్ల షరతులేగా. నేను ఒప్పుకోను."

కొన్నాళ్లపాటు స్నేహితురాళ్లందరి పెళ్లిళ్లూ అయితే మారుతుందనుకున్నారు తల్లీ, తండ్రీ. కానీ వాళ్లు అనుకున్నట్లు కాలేదు. స్నేహితురాళ్లంతా కట్నాలిచ్చి, ఉద్యోగాలు ఆశ చూపి పెళ్లిళ్లు చేసుకుంటూంటే దుమ్మెత్తిపోస్తూ ఉండేది. కూతురికి నచ్చ చెప్పి, పెళ్లి చెయ్యగలమన్న రామారావుగారి ఆశ అడుగంటి పోయింది.

నాలుగేళ్లు గడిచిపోయాయి. ముందు ఉత్సాహంగా సంబంధాలు చెప్పే బంధుమిత్రులు ఆపని మానేశారు. ఎలాగూ సంబంధం పొసగదులే అనుకుంటూ. కాలక్షేపానికి దగ్గర కాలేజీలో ఉద్యోగంలో చేరింది మాలిని. "అమ్మాయికి సంబంధాలు

చూస్తున్నారా" అంటే "కొన్నాళ్ళు ఉద్యోగం సరదా తీరాలి కదా" అని తల్లితండ్రులు చెప్పకుండుకు బాపుండేది.

❖ ❖ ❖

రామారావుగారు, సీతమ్మగారూ ముందు హాల్లో కూచుని మాట్లాడుకుంటున్నారు. సీతమ్మగారి మొహంలో ఆందోళన కన్పిస్తోంది.

"దానీడు పిల్లలందరికీ పెళ్ళిళ్లయిపోతున్నాయి. అమ్మాయి మొండిగా ఉంటోంది. మొన్న నాక్కోపం వచ్చి 'ఎవర్నైనా ప్రేమించి పెళ్లి చేసుకో' అన్నాను. మా కాలేజీలో అంతగా ప్రేమించేవాళ్లు ఎవరున్నారు అంది."

"నిజమే మనకి ఒక్కగానొక్క పిల్ల. దానికి తగ్గవాడు కావాలనుకుంటోంది. ఆ జూనియర్ కాలేజీలో నెలకి వెయ్యి రూపాయలైనా రానివాణ్ణి ఏం చేసుకుంటుంది."

"పోనీ అమ్మాయికి తెలియకుండా కట్నమిస్తే"

"అమ్మాయి సంగతి తెలిసే మాట్లాడుతున్నావా? ఎప్పుడు తెలిస్తే అప్పుడే భర్తని దుమ్మెత్తిపోసి వచ్చెయ్యగలదు."

ఇంతలో పోస్ట్‌మాన్ ఒక ఉత్తరమిచ్చి వెళ్లేడు.

రామారావుగారు చదివి "నా బాల్యమిత్రుడు పురుషోత్తం జ్ఞాపకమున్నాడుగా. వాళ్ల అబ్బాయి ఉద్యోగం విషయంలో ఎంప్లాయిమెంటు ఎక్స్ఛేంజిలో ఏదో పనుందట. వస్తున్నానని రాశాడు. ఏం పనో వస్తే కానీ తెలియదు."

❖ ❖ ❖

పురుషోత్తంగారు వచ్చేక విషయం తెలిసింది. ఆయనతో వాళ్ల అబ్బాయి కిషోర్ వచ్చాడు. ఎమ్.ఏ., ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడనీ, వాళ్ల ఊళ్లోనే షుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడనీ తెలిసింది. దూరపు బంధువెవరో ఓ.ఎన్.జి.సి.లో పెద్ద రాంకులో ఉన్నాట్ట. ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజి నుంచి పేరు తెచ్చుకుంటే క్లర్కుపోస్టులో వేయించగలనని చెప్పేట్ట. ఆ పని మీదనే వచ్చారు.

మాలిని కిషోర్‌తో చాలా స్నేహంగా మాట్లాడింది. అతని మాట తీరూ, తెలివి తేటలూ నచ్చేయి. ఆమెకు ఫైలుగా వచ్చిన కప్పు గురించి అడిగేడతను. ఆ సమయానికే అక్కడకు వచ్చారు రామారావుగారూ, పురుషోత్తంగారూ. వరకట్నం మీద మాట్లాడినందుకు వచ్చిందని చెప్పింది మాలిని.

"నేను వరకట్నానికి వ్యతిరేకినే. మా అమ్మాయికి కట్నమివ్వలేదు. మా అబ్బాయికి తీసుకోను" అన్నారు పురుషోత్తంగారు.

"అల్లుడికేమిటి పని" రామారావుగారడిగేరు.

"మా ఊళ్లోనే ప్రైవేటు స్కూల్లో టీచరు."

ఎక్స్ఛేంజ్‌లో పని పాతికవేల ముడుపుకి కానీ అవదని తెల్సింది. అంత డబ్బిద్దామన్నా లేదు.

మాలిని అడిగింది కిషోర్ని. "లంచమిచ్చి ఉద్యోగం వేయించుకోవడం మీ కిష్టమేనా?"

"లేదు మంచి ఉద్యోగం రావాలన్నది నా ఆశ. అవినీతికి పాల్పడనన్నది నా ఆశయం. నా ఆశ తీరడానికి నా ఆశయం వదులుకోను."

"ఆశ - ఆశయం తేడా ఒక్క అక్షరమేయం"

"యం అంటే ఇంగ్లీషులో మనీకి మొదటి అక్షరం. ఆ మనీలేదు. ఉన్నా నా ఆశయం వదులుకునేవాణ్ణి కాదు."

మాలిని అతన్ని మనస్సులో ఎంతో అభినందించుకుంది.

మాలినిని చూడ్డానికి రామారావుగారు ఒక ఐ.ఎ.యస్. ఆఫీసర్ని పిలిచేరు. పెళ్లికొడుకు, అతని తల్లితండ్రులూ, అమెరికాలో ఉన్న అక్కా వచ్చి వెళ్లేరు. మగపెళ్లివారు మర్యాదగానే కన్పించారు.

❖ ❖ ❖

రెండు వారాల తర్వాత రామారావుగారి పేర రెండుత్తరాలు వచ్చేయి.

"మీ ఇంట్లో ఉన్న రోజుల్లో మీ అమ్మాయి ప్రవర్తనా, చదువూ, సంస్కారం మాకెంతో నచ్చేయి. బాల్యమిత్రుడిని కాబట్టి నేనే అడుగుతున్నాను. మీకు ఎవరికీ అభ్యంతరం లేకపోతే మాలినిని మా ఇంటికోడలిగా చేసుకుంటాం" అని పురుషోత్తంగారు రాశారు.

"మీ అమ్మాయి మాకు నచ్చింది. ఇకపోతే మేం కట్నం తీసుకోము" మగ పెళ్లి వారి ఉత్తరానికి మాలిని ముఖం వెలిగిపోయింది. రామారావుగారు ఉత్తరం చదవసాగారు. "అమ్మాయి పేరున ఒక ఫ్లాటూ, అబ్బాయికి అలక పాన్పు మీదకి కారూ, ఆడపడుచు వియ్యపురాలి లాంఛనాలు చెరో అయిదువేలూ, పట్టుచీరలూ..." లిస్టు సాగిపోయింది. పెళ్లికి వెయ్యిమంది దాకా వస్తామన్నారు.

రామారావుగారు మాలినికేసి చూశారు. "అమ్మాయి, నీ ఇష్టం. పాతికేళ్లు దాటిపోతున్నాయి. ఈ రెండు సంబంధాలలో ఏదో ఒకటి నిర్ణయించి చెప్పెయ్యి"

మాలిని ప్రూస్పడిపోయి కూచుంది. తను వరకట్నం లేకుండా పెళ్లి చేసుకుంటానని నిర్ణయించుకుంది. అయితే ఏనాడూ తను కట్నం తీసుకోని వరుణ్ణి ఒక ప్రైవేటు కంపెనీ క్లర్కుగా ఊహించుకోలేదు. ఏకలెక్టరో, ఇంజనీరో, డాక్టరో అనుకుంది. చూసుకువెళ్లిన సంబంధం ఆమె కళ్లముందు మెదిలింది. కారులో షికార్లు, ఇంట్లో ఫ్యాన్లు అమెరికా చీరలూ ఆమెను ఆకర్షించేయి. పెంకుటింట్లో నివాసం, వంటింట్లో చాకిరీ, ఆడబిడ్డకు తామే చెయ్యాల్సిన సాయం ఆమెను భయపెట్టాయి. ఇంతలో కట్నమిచ్చి వివాహం చేసుకోనన్న తన ఆశయం జ్ఞాపకమొచ్చింది. ఆ ఆశయం అంత సరైనది కాదేమో! తన తండ్రికి డబ్బుంది ఇవ్వగలడు. తను చేసుకోకపోతే కిషోర్ ఇంకో బీద ఇంటి అమ్మాయిని చేసుకుంటాడు. ఆవిధంగా తనో బీద కుటుంబం వరకట్నపు కోరలలో నలిగిపోకుండా ఆదుకుంటుంది. అదీ తన ఆదర్శాన్ని నిలబెట్టుకోడమేగా. మాలినికి ఆ భావం ఎంతో ఆనందాన్నిచ్చింది.

"పెళ్లిలో మనసుకే కానీ డబ్బుకి స్థాన ముండకూడదన్నావు. పెళ్లికొడుకు జీతం లెక్క డబ్బుని చూడ్డం కాదా."

ఫ్రైజు కప్ప ఫక్కున నవ్వినట్లనిపించింది. ఎటూ నిర్ణయించుకోలేని అయోమయ స్థితిలో ఉండిపోయింది మాలిని.

(రచన)